దుర్గంలో దంచికొట్టిన వర్షం

- ఉరుములు, మెరుపులతో బీభత్సం
- శబ్దాలకు భీతిల్లిన జనం

రాయదుర్గం: పట్టణం భారీ వర్షంతో తడిసిముద్ద య్యింది. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల దాకా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వాటి శబ్దాలకు ప్రజలు భీతిల్లిపోయారు. చూస్తుండగానే లోతట్టు ప్రాంతాలైన కొలిమి, రామస్వామి, మధు టాకీస్ ఏరియాల్లోకి వరదనీరు మోకాలి లోతు వచ్చి చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చినుక పడగానే పట్టణం మొత్తం చీకటి మయమైంది. ఉక్కపోత, దోమల మోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. నియోకవర్గంలోని డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోనూ పలు గ్రామాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. ఖరీఫ్ సాగుకోసం సిద్ధం చేసిన మెట్ట భూముల్లోకి నీరు చేరింది. బోరుబావుల కింద సాగు చేసిన రాగి, మొక్కజొన్న, జొన్న, పత్తి పంటల్లోకి వరదనీరు చేరింది. కుంటలు, వాగులు, చెరువులకు జలకళ సంతరించుకుంది. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు బీటీ ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది.

కణేకల్లులో మోస్తరు వర్షం

కణేకల్లు: మండలంలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కణేకల్లు, కణేకల్లు క్రాస్, కొత్తపల్లి, ఆలూరు, యర్రగుంట, మాల్యం, సొల్లాపురం, ఎస్.హనుమాపురం గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షపాతం 20 ఎంఎంగా నమోదైంది. వర్షానికి వంకలు, వాగులు పారాయి. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. గ్రామాల్లో రైతులు వేరుశనగ పంట సాగు కోసం పొలాలను దుక్కులు చేస్తున్నారు. ఈనెల రెండు లేదా మూడో వారంలో రైతులు వేరుశనగ సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.


కణేకల్లు శివారులో వంకలో ప్రవహిస్తున్న వరదనీరు

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

బ్రహ్మసముద్రం : అధైర్య పడొద్దు..అండగా ఉంటాం అని మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం గుండె పోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి బొమ్మన్న (63) మృతి చెందాడు. ఈ సందర్భంగా వారు పడమటి కోడిపల్లి గ్రామానికి వెళ్లి తలారి బొమ్మన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగయ్య మాట్లాడుతూ అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంబం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మమత, గంగాధర , ఎమ్మెస్ హనుమంతరాయుడు, తిప్పేస్వామి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, నాయకులు మహేష్‌స్వామి, ఎరడికెర ఎర్రిస్వామి, నాయకులు పాల్గొన్నారు.


బొమ్మన్న కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తలారి రంగయ్య

నేడు రంగయ్య పర్యటన

బ్రహ్మసముద్రం : మండలంలోని ముద్దలాపురం గ్రామంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య పర్యటించనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలియజేశాయి.

రైతులకు అందుబాటులో ఉండండి


కూడేరు: మాట్లాడుతున్న ఏఓ విజయకుమార్


వజ్రకరూరులో విత్తన పంపిణీ చేస్తున్న అధికారులు

కూడేరు: ఖరీఫ్‌లో విత్తన సాగుకు సమయం దగ్గరపడుతోంది.. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండి, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు అందించాలని ఏఓ విజయ కుమార్ సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఏఓ మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలకు సంబంధించిన సిబ్బందితో సమావేశమయ్యారు. రిజిస్ట్రేషన్, విత్తన పంపిణీపై సిబ్బందితో ఆరా తీశారు. సబ్సిడీ విత్తన వేరుశనగ కొరత లేదన్నారు. అర్హత ఉన్న రైతులందరికీ విత్తన వేరుశనగ అందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 2,730 మంది రైతులు సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అందులో 2,340 మందికి 2,176 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. మండలానికి 750 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కావాలని అధికారులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, ఏఈఓ శైలజ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ

వజ్రకరూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలు సాగు కు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పొలాలను చదును చేసే పనిలో నిమగ్న మయ్యారు. విత్తన పంపిణీని ఏఓ మధుకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో వీఏఏ సురేష్ కుమార్‌నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో సత్ఫలితాలు


కూడేరు: ఇప్పేరు వద్ద చెక్ డ్యాంలో నిలిచిన వర్షపు నీరు


కూడేరు: గొటుకూరులో వర్షపు నీటితో నిండిన ఫారంపాండ్

కూడేరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రైతు పొలాల్లో ఫారంపాండ్లు , వంకల్లో డకౌట్‌పాండ్లు తవ్వితే, చెక్ డ్యాంల్లో పూడికలు తీస్తే అందులో వర్షం నీరు నిల్వ ఉంటుంది. తద్వారా భూగర్భ జలాలు పెంపొందుతాయన్నది ఉపాధి హామీ పథకం ఉద్దేశం. మండలంలో 14 పంచాయతీలు, 28 గ్రామాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఉపాధి హామీ అధికారులు సుమారు 130 వరకు ఫారంపాండ్లు, డకౌట్ పాండ్లను తవ్వించారు. సుమారు 20 చెక్ డ్యాంల్లో పూడికను తీయించారు. కొద్ది రోజుల నుంచి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గరిష్టంగా 50.4 మిల్లీ మీటర్ల వరకు వర్షం కురిసింది. వర్షం నీరు ఫారం పాండ్లు, డకౌట్ పాండ్లు , చెక్ డ్యాంల్లోకి చేరింది. దీంతో అవి వర్షం నీటితో కళకళలాడుతున్నాయి.

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌పై అవగాహన కల్పించండి

కణేకల్లు: డ్రైల్యాండ్ హార్టికల్చర్‌పై రైతుల్లో అవగాహన పెంచి పండ్లతోటలు సాగు చేసేలా చూడాలని ఎంపీడీఓ గూడెన్న, ఏపీఓ సుధాకర్ తెలిపారు. గురువారంస్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మామిడి, అల్ల నేరేడు, సపోట, చింత, జామ, దానిమ్మ, అంజూర, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలను ఉచితంగా ఇవ్వడంతోపాటు వాచ్ అండ్ వార్డు వ్యయాన్ని కూడా చెల్లిస్తామన్నారు. మూడేళ్ల వరకు పండ్లతోటల సంరక్షణ వ్యయాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రైతూ తనకున్న పొలంలో 25 సెంట్ల స్థలంలో పూల మొక్కలు పెంచుకోవాలన్నారు. జాస్మిన్, గులాబీ పూల మొక్కలను పెంచుకోవచ్చని, వీటి పెంపకం ఖర్చు చెల్లిస్తామన్నారు. ఎకరా విస్తీర్ణంలో మునగ కూడా సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీఏలు సోమన్నగౌడ్, హరి, ఈసీ రమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గూడెన్న

కేంద్ర మంత్రి పదవి ఎవరికో?

- లోక్‌సభ సభ్యులుగా ముగ్గురు మాజీ సీఎంలు
- ఇద్దరు బీజేపీ కాగా ఒకరు జేడీఎస్ నాయకుడు


బసవరాజ్ బొమ్మై


జగదీష్ శెట్టర్


కుమారస్వామి

సాక్షి,బళ్లారి: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమికి కర్ణాటకలో మెజార్టీ సీట్లు లభించాయి. మొత్తం 28 లోక్‌సభ స్థానాల్లో బీజేపీకి 17 సీట్లు, కాంగ్రెస్‌కు 9 సీట్లు, జేడీఎస్‌కు 2 స్థానాలు దక్కడంతో వీరిలో అత్యంత సీనియర్లు, రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పని చేసిన అపార అనుభవం ఉన్న ముగ్గురు ముఖ్య నేతలు లోక్‌సభ మెంబర్లుగా గెలుపొందారు. ఎన్‌డీఏ కూటమిలో జేడీఎస్ పార్టీ నాయకుడు మాజీ సీఎం కుమారస్వామి మండ్య లోక్‌సభ మెంబరుగా, హావేరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, బెళగావి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసిన మాజీ సీఎం జగదీష్ శెట్టర్ గెలుపొందారు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారే. వీరిలో జగదీష్ శెట్టర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి తిరిగి సొంతగూడు బీజేపీకి చేరుకుని, అనూహ్య పరిణామాలతో నాన్‌లోకల్ అయినా బెళగావి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి అందరిని ఆశ్చర్యపరిచే విధంగా భారీ మెజార్టీతో గెలుపొందారు. ముగ్గురు మాజీ సీఎంలు ఎన్‌డీఏకు చెందిన వారే.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె: శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ హెచ్చరించారు. గురువారం ఎస్ఐ పలు గ్రామ ల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న,చిన్న విషయాలకు ఘర్షణ పడరాదన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఐకమత్యంతో పోరాడితే విజయమే

బళ్లారిఅర్బన్: విద్యార్థుల సమస్యలపై ఐకమత్యంగా కలిసి పోరాడితే విజయం సాధించవచ్చని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కాంత్ తెలిపారు. గురువారం స్థానిక ఏఐడీఎస్ఓ జిల్లా కార్యాలయంలో వివిధ పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థుల సమక్షంలో విద్యాభివృద్ధికి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల జాతీయ విద్యా ప్రణాళిక(ఎన్‌ఈపీ)కి వ్యతిరేకంగా కర్ణాటక రాష్ట్రంలో ఉద్యమం విజయవంతమైంది. ఢిల్లీలో రైతుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని మన రాష్ట్రంలో ఎన్ఈపీకి వ్యతిరేకంగా బలమైన వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తెచ్చారన్నారు. అనేక అడ్డంకులు ఉన్నా విద్యార్థుల లక్ష్యం ఒకటే. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అలాగే ఉండాలన్నారు. ఏఐడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి సుభాష్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫీజుల పెంపు, విద్యార్థి భృతి, బస్సు సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు.

వినూత్నంగా జన్మదిన వేడుక

బళ్లారిఅర్బన్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచాలని కరవే శివరామగౌడ బణ బళ్లారి, విజయనగర జిల్లాల అధ్యక్షుడు కురిహట్టి రాజన్న పేర్కొన్నారు. ఆయన బుధవారం సిరుగుప్ప రోడ్డులోని కురిహట్టి ప్రాంతంలో కరవే పదాధికారులు, అభిమానుల సమక్షంలో మొక్కలను నాటి వినూత్నంగా జన్మదిన వేడుకను జరుపుకున్నారు. కార్యక్రమంలో కరవే పదాధికారులు చంద్రన్న, పటేల్ నగర్ కటిగే సూరి, కురుగోడు అధ్యక్షుడు మృత్యుంజయ, హనుమంతప్ప, గుడిగంటి హనుమంతు, జిల్లాలోని వివిధ తాలూకాల అధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శనీశ్వరుడి జయంతి వేడుకలు


పావగడ: శనీశ్వరస్వామి చెంత పూజలందుకున్న నవగ్రహాలు


అమరాపురంలో శనీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

పావగడ: పట్టణంలోని శనిమహాత్ముడి ఆలయంలో గురువారం స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రాతఃకాల పూజలు, నవగ్రహ మూల మూర్తులకు ఏకాదశ వార రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, ప్రధాన మూల మంత్ర హోమాలు, గాయత్రి హోమం, మహా పూర్ణాహుతి, కలశోదక అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అనంతరం జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామి దీపాలంకృత ఉత్సవం కనుల పండువలా సాగింది. మూడు రోజులుగా సాగుతున్న శని జయంతి వేడుకలు గురువారం ముగిశాయి. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. ఆలయ సమితి పదాధికారులు భక్తులకు సేవలందించారు.

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండులో వెలసిన శనీశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అర్చకులు నరసింహభట్టాచార్యులు తైలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రాకారోత్సవం, నవగ్రహ పూజ, సాయంకాలం ఉయ్యాలోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

పశువుల మందతో ట్రాఫిక్ కష్టాలు


ప్రధాన రహదారిపై తిరుగుతున్న పశువుల మంద


పట్టణంలోని వినాయక సర్కిల్‌లో తిష్టవేసిన గాడిదలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువుల మందలు తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దుకాణదారులు, స్థానికులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ సమీపంలోని ఆవులు, గాడిదలను యజమానులు రోడ్లపై వదులుతుండడంతో సమస్య తలెత్తుతోంది. గతంలో ఈ విషయంపై అధికారులు పలుమార్లు పశువుల యజమానులను హెచ్చరించారు. కానీ వారు పట్టించుకోలేదు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి పెట్రోల్ బంక్ సర్కిల్, పాత బస్టాండ్ నుంచి మొలకాల్మూరు బస్టాండ్, బళ్లారి బస్టాండ్‌తో పాటు కూరగాయల మార్కెట్‌లో పశువులు రోడ్లపై హల్‌చల్ చేస్తున్నాయి. పశువులు మందలు మందలుగా వస్తుండడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పట్టణ రహదారులపై గాడిదలు అధికంగా సంచరిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళకు గాయాలు

యాడికి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి మహిళ తలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చందన గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామా నికి చెందిన గొల్ల లక్ష్మీ కాంతమ్మ తన కుమారుడు తేజతో కలసి ద్విచక్ర వాహనంలో రాయలచెరువుకు బయలు దేరారు. చందన గ్రామ చివరన రాయలచెరువుకు పోయే మార్గంలో ఉన్న వ్యవసాయ బోరుబావుల వద్ద రైతులు ఇటీవల పొలాలకు పైపులైను ఏర్పాటు చేసేందుకు రోడ్డును తవ్వి మళ్లీ మట్టిని కప్పటంతో పెద్ద స్పీడు బ్రేకరు మాదిరిగా ఉంది. గమనించని తేజ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడంతో.. వాహనం అదుపు తప్పి వెనుక కూర్చొన్న లక్ష్మీకాంతమ్మ కింద పడటంతో చెవులో నుంచి రక్తం వచ్చింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రేపు 'మ్యూజికల్ నైట్స్'

గుత్తి: పట్టణంలోని కేఎం ఫంక్షన్ హాల్ (ఓల్డ్ రాయల్ సినిమా థియేటర్)లో ఈ నెల శనివారం మ్యూజికల్ నైట్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బాల సుబ్రమణ్యం జయంతి వేడుకల్లో భాగంగా మ్యూజికల్ నైట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో ఫాతేహాలు


అలంకరణలో సర్మాస్ హుసేనీస్వామి దర్గా

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి, నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

వైభవంగా అన్వరానంద స్వామి ఊరేగింపు


చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కంబదూరు: మండలంలోని ఓబగానపల్లిలో గురువారం వైశాఖ మాస అమావాస్యను పురస్కరించుకుని అన్వరానంద స్వామి చిత్ర పటాన్ని ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పాటలు పాడారు. ఉదయం నుంచి ఆశ్రమంలో స్వామికి భజనలు చేశారు. ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక భంభం బాబా అన్వరానంద స్వామి సేవా సమితి సభ్యులు తదితర భజన బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి, రాఘవేంద్రస్వామికి పూజలు


ప్రత్యేక పూజలందుకున్న షిర్డీసాయినాథుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయాల్లో గురువారం భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయి ఆలయంలో స్వామికి మంగళహారతి, అర్చనలు చేశారు. ప్రతి గురువారం సాయినాథుడికి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదం అందించారు. పట్టణంలోని కోటలో వెలసిన రాఘవేంద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం


వజ్రకరూరులో అలంకరణలో షిర్డీసాయి

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం అత్యంత కనుల పండువగా జరిగింది. రాత్రి శేజ్‌హారతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పంటల సాగుపై అవగాహన అవసరం

- డీఆర్‌సీ డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: కంది, వేరుశనగ, ఆముదం తదితర పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేశారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సాగుకు సమాయత్తం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్ర (డీఆర్‌సీ) డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ, డీఆర్‌సీ వ్యవసాయ అధికారి శ్రీనివాసులు పాల్గొని, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వేరుశనగ, కంది, ఆముదం పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త మల్లికార్జున, ఏడీఏ ఎల్లప్ప, ఏఓ జగదీష్ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గౌరీదేవి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

కిరాణాషాపులో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో కృష్ణమూర్తి అనే వ్యక్తికి చెందిన కిరాణాషాపులో చోరీ జరిగింది. గురువారం ఉదయం కృష్ణమూర్తి దుకాణాన్ని తెరవగా, చోరీ జరిగినట్లు గుర్తించాడు. రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న షాపు వెనుక వైపు రేకును కోసి దుండగులు ప్రవేశించి, చోరీకి పాల్పడ్డారు. రూ.25 వేల నగదు, రూ.50 వేల విలువైన సరుకులు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శివాలయాల్లో అమావాస్య పూజలు


వజ్రకరూరులో అలంకరణలో నగరేశ్వరస్వామి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతి, రుద్రాభిషేకం, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మండలంలోని జరుట్లరాంపురం గ్రామంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ అమావాస్య పూజలు నిర్వహించారు. కమలపాడులోని శివాలయంలోనూ అమావాస్య పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ


చిన్నముష్టూరులో మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరులో మలేరియాపై అవగాహన ర్యాలీ గురువారం చేశారు. రాకెట్ల పీహెచ్‌సీ సీహెచ్‌ఓ నాగరంగయ్య ఆధ్వర్యంలో మలేరియాపై వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ చేశారు. ర్యాలీని ఉద్దేశించి సీహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించి, ఇంట్లో ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఏఎన్ఎం హేమలత, సీఓ భగవాన్‌దాస్ పాల్గొన్నారు.